నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
3 | నిజామాబాద్ శుక్రవారం 28 జూన్ 2024 | ADILABAD NIRMAL

ట్రాన్స్‌జెండర్స్‌కు గుర్తింపు కార్డులు జారీ

గుర్తింపు కార్డు, సర్టిఫికెట్‌లు అందుకున్న ట్రాన్స్‌జెండర్స్‌తో కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జూన్ 27 : సమాజంలో ట్రాన్స్‌జెండర్స్ గుర్తింపునకు, హక్కుల పరిరక్షణకు గుర్తింపు కార్డు, సర్టిఫికెట్స్‌ను పంపిణీ చేశామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ట్రాన్స్‌జెండర్స్‌కు గుర్తింపుకార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిమిది మంది ట్రాన్స్‌జెండర్స్‌కు పత్రాలు అందజేశారు. అనంతరం వారు కలెక్టర్‌కు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి సబితా, ఏసీడీపీవో మిల్కా పాల్గొన్నారు.

ఈవీఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్

గోదాములోని ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్ అర్బన్, జూన్ 27 : కలెక్టర్ కార్యాలయ సమీపంలో గల ఈవీఎం గోదాములను గురువారం కలెక్టర్ అభిలాష అభినవ్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌లు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి పరిశీలించారు. నిరంతరం పటిష్ట భద్రతను కొనసాగించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వారి వెంట నిర్మల్, ముథోల్, ఉట్నూర్ ఆర్డీవోలు రత్న కల్యాణి, కోమల్‌రెడ్డి, జీవాకర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్ ఉన్నారు.

- అధ్వానంగా జాతీయ రహదారి
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు
- భారీస్థాయిలో టోలు వసూలు

నేరడిగొండ మండలం రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద రహదారిపై గుంతలు

ఆదిలాబాద్, జూన్ 27(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలోని నేషనల్ హైవే(ఎన్‌హెచ్-44) అధ్వానంగా మారింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారుల నిర్లక్ష్యం మూలంగా వాహదారులు అవస్థలు పడుతున్నారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే రహదారిని గాలికొదిలేశారు. గుంతలు పడ్డ ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టడం లేదు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి దక్షిణాది రాష్ట్రాలకు రాకపోకలు సాగించే ఎన్‌హెచ్-44 ఆదిలాబాద్ జిల్లాలోని నేరడిగొండ నుంచి జైనథ్ మండలం మహారాష్ట్ర సరిహద్దు డొల్లార వరకు 80 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. రెండు వరుసల రోడ్డును 2008 సంవత్సరంలో నాలుగు వరుసలుగా విస్తరించారు. ఈ రహదారి మీదుగా ప్రజా రవాణాతోపాటు సరుకుల రవాణా చేసే వాహనాల సంఖ్య వేలల్లో ఉంటుంది. రోడ్డు నిర్మాణ లోపం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించినా ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సరిచేయకపోవడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మావల క్రాసింగ్, భోరజ్ చెక్‌పోస్టు, మావల మూలమలుపు, దేవాపూర్ క్రాసింగ్, గుడిహత్నూర్ బస్టాండ్ ఏరియా, గాంధీనగర్, ఉట్నూర్ క్రాస్‌రోడ్డు, సీతాగోంది ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించినా చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. గుడిహత్నూర్ మండలం సీతాగొంది వద్ద రోడ్డు పల్లంగా ఉండడంతోపాటు మూలమలుపులు అధికంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఘాట్ రోడ్డుతో వాహనాలు మితిమీరిన వేగంతో వస్తుండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా అవసరమైన చోట సర్వీస్ రోడ్లు, స్లీప్ రోడ్లు, అండర్ పాస్‌లు చేపట్టలేదు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు పలుమార్లు కోరినా ఫలితం లేదు.

వాహదారుల ఇబ్బందులు

రోడ్డు చాలా చోట్ల దెబ్బతినడంతో ఎప్పుడూ ఏం ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయపడుతున్నారు. నాలుగు వరుసల రహదారి కావడంతో వాహనాలు వేగంగా వెళ్తుంటాయి. రోడ్డుపై ఉన్న గుంతలు దగ్గరికి వచ్చేంత వరకు కనబడకపోవడంతో తప్పించే పరిస్థితి ఉండదని డ్రైవర్లు వాపోతున్నారు. దీంతో వాహనాలపై మెల్లిగా పోవాల్సి వస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారీగా టోల్ వసూలు

ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని ఎన్‌హెచ్-44పై నేరడిగొండ మండలం రోల్‌మామడ, జైనథ్ మండలం డొల్లార వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. వీటి వద్ద భారీగా పన్నులు వసూలు చేస్తున్నారు. 2008 నుంచి పన్నులు వసూలు చేస్తున్నా రోడ్డు భద్రతను గాలికొదిలేశారు. ఆదిలాబాద్ జిల్లాతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి రోజు 10 వేలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఒక్కో టోల్‌ప్లాజా వద్ద కార్లకు రూ.160 మొదలుకుని భారీ వాహనాలకు రూ.1000 వరకు వసూలు చేస్తున్నారు. వాహనదారుల వద్ద నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు రోడ్డు నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుడిహత్నూర్ మండలం సీతాగొంది వద్ద..

దేవాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద..

రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది..

నేను ఇంద్రవెల్లి నుంచి ఆదిలాబాద్ జిల్లాకేంద్రానికి పనుల కోసం వెళ్తుంటా. గుడిహత్నూర్ నుంచి ఆదిలాబాద్ వరకు ఎన్‌హెచ్-44 రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. వాహనాలు వేగంగా వస్తున్నాయి. గుంతల కారణంగా ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయమవుతున్నది. వాహనదారుల నుంచి టోల్ వసూలు చేస్తున్న అధికారులు రహదారి నిర్వహణను పట్టించుకోవడం లేదు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి. రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నా.

- నిసార్, వాహనదారుడు, ఇంద్రవెల్లి

డిమాండ్స్ నెరవేర్చాలి..

ట్రిపుల్ ఐటీ ఎదుట కార్మికుల ధర్నా

స్పెషల్ ఆఫీసర్ సృజనకు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

బాసర, జూన్ 27 : తమ డిమాండ్స్ నెరవేర్చాలని కోరుతూ గురువారం ట్రిపుల్ ఐటీ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడుతూ.. జీవో నంబర్ 60 ప్రకారం కనీస వేతనం రూ.16,600లను కీపింగ్ వర్కర్స్‌కు చెల్లించాలని, అదే విధంగా కాంట్రాక్టర్లకు రెండేండ్లుగా పెరిగిన వీడీఏ డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండేండ్లుగా కాంట్రాక్టు తీసుకుని నేటికీ కార్మికులకు ఐడెంటిటీ కార్డులు, యూనిఫామ్స్ ఇవ్వడం లేదని.. ఈఎస్‌ఐకి ఫోన్ నంబర్లు కూడా లింక్ చేయడం లేదని పేర్కొన్నారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ సృజనకు పలు డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మాజీ జిల్లా కార్యదర్శి నూతన్‌కుమార్, ట్రిపుల్ ఐటీ హౌస్ కీపింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పీరాజీ, ఉపాధ్యక్షులు దయానంద్, శారదా, మునీరా పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ సభ్యులు

నీట్ పరీక్షను రద్దు చేయాలి..

ఎదులాపురం, జూన్ 27 : నీట్ పరీక్షను, ఎన్‌టీఏ సంస్థను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీట్ పరీక్ష విశ్వసనీయతను కోల్పోయిందన్నారు. 23 లక్షల మంది విద్యార్థులు ఏళ్ల తరబడి కష్టపడి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ సిద్ధమయ్యారన్నారు. నీట్ పరీక్షను రద్దు చేసి రాష్ట్రాలకు, యూనివర్శిటీలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శా మ్యూల్, తెలంగాణ విద్యా పరిరక్షణ కమి టీ టీడీఎఫ్, టీపీటీఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ బాధ్యులు శ్రీనివాస్, వృకోధర్, రామేశ్వర్, జ్ఞానేశ్వర్, భుజంగ్‌రావు, హరీశ్ గేడం, కేశవ్, గణేశ్, రాహుల్, అశోక్, నవీన్ పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..

ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 27 : పోలీసు అధికారులు కొత్త చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ జానకి షర్మిల సూచించారు. పోలీసు అధికారులకు నూతన చట్టాలపై ఇస్తున్న ముగింపు శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జూలై ఒకటో తేదీ నుంచి కొత్త చట్టాలు అమలులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ప్రతి సబ్ డివిజన్‌లోని అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. దీంతో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి ఆయా సెక్షన్ల కింద కేసులు నమోదు చేయవచ్చన్నారు. అరెస్టు, వాంగ్మూలం, నమోదులో పాటించాల్సిన జాగ్రత్తలు, నిందితులకు శిక్షలు ఖరారు చేయడంలో దర్యాప్తు అధికారులు వ్యవహరించవలసిన తీరు వంటి అంశాల గురించి వివరించారు. కార్యక్రమ నిర్వహణలో అన్నితానై వ్యవహరించిన డీసీఆర్బీ సీఐ గోపీనాథ్, ఆర్ఎస్ఐ రవికుమార్, శిక్షకులు నవీన్‌కుమార్, సైదారావు, ఎస్సైలు సాయికుమార్, సాయికిరణ్, జ్యోతిమణిని ఎస్పీ అభినందించారు.

అటవీ ప్రాంతాన్ని ఆక్రమిస్తే చర్యలు

మంచిర్యాల ఎఫ్‌డీపీటీ అధికారి శాంతారామ్

ఆక్రమణకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఇచ్చోడ, జూన్ 27 : అటవీ ప్రాంతాన్ని, సంపదను ఆక్రమిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని మంచిర్యాల ఎఫ్‌డీపీటీ అధికారి శాంతారామ్, ఆదిలాబాద్ జిల్లా అటవీశాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ అన్నారు. ఇటీవల కంపార్ట్‌మెంట్ నంబర్ 174 బాబ్జిపేట్ బీట్ పరిధిలో ఆక్రమణకు గురైన ప్రదేశాన్ని గురువారం అటవీ, పోలీసు సిబ్బందితో కలిసి పరిశీలించారు. అటవీ భూ ఆక్రమణ, స్మగ్లింగ్‌పై ఆధారపడి జీవించే ముల్తానీలు చాలా వరకు నాశనం చేసిన అటవీ ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఒక్కో కుటుంబం దాదాపు 15-17 ఎకరాల వరకు మొత్తం సుమారు 3,920 ఎక zరాల భూమిని వారు ఆక్రమించినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా భూమిని ఆక్రమించిన వారితోపాటు కేశవపట్నం గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. ముల్తానీల జీవనోపాధి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చే యాలని ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. రేపటి నుంచి యథావిధిగా మొక్కలు నా టే కార్యక్రమం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. బృహత్తరమైన కార్యక్రమానికి సహాయ, సహకారాలు అందిస్తున్న పోలీసు శాఖను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిరిచెల్మ ఫారెస్ట్ రేంజ్ అధికారి గణే శ్, పెంబి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రామకృష్ణ, సిరిచెల్మ ఉప అటవీ క్షేత్రాధికారి గీరయ్య, ఇచ్చోడ సీఐ భీమేశ్, నేరడిగొండ, గుడిహత్నూర్ ఎస్సైలు శ్రీకాంత్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు భరోసా కల్యాణలక్ష్మి

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

కల్యాణలక్ష్మి చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బజార్‌హత్నూర్, జూన్ 27 : పేదింటి ఆడబిడ్డలకు భరోసాగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం చేయుతనిస్తున్నదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో తహసీల్దార్ శంకర్ ఆధ్వర్యంలో 52 మంది లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఆడబిడ్డల పెండ్లిళ్ల కోసం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం భరోసాగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, పీఏసీఎస్ చైర్మన్ వెంకన్న, తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ రాజారాం, నాయకులు చిల్కూరి భూమయ్య, చట్ల గజ్జయ్య, కుర్మె లక్ష్మణ్, కవిందర్, మడిగే రమేశ్, సకేశ్, గజానంద్, సాయన్న, చైతన్య, జనార్దన్ పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలి..

బజార్‌హత్నూర్ మండలంలోని కొల్వారి గ్రామ సమీపంలోని ఇచ్చోడ-సోనాల ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌తో మాట్లాడుతూ.. త్వరితగతిన వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు.

ప్రాణాలు కాపాడిన పోలీసులు

నిర్మల్ అర్బన్, జూన్ 27 : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని కాపాడిన ఘటన నిర్మల్ పట్టణంలో చోటు చేసుకున్నది. వివరాలిలా ఉన్నాయి.. నిర్మల్ పట్టణంలోని మహాలక్ష్మీవాడ కాలనీకి చెందిన మంగమ్మ ఇంట్లో తన అక్కకొడుకు రాజ్‌కుమార్ ఉరి వేసుకుంటున్నానని బుధవారం రాత్రి 10 గంటలకు డయల్ 100కు సమాచారం అందించాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు రాథోడ్ అనిల్, అజర్ ఖాన్, పెట్రోకార్ సిబ్బంది తిలక్, హోంగార్డు శివప్రసాద్ హుటాహుటిన అక్కడికి చేరుకుని తలుపులు పగుల గొట్టి లోనికి వెళ్లారు. అప్పటికే ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకునేందుకు ప్రయత్నిస్తున్న రాజ్‌కుమార్‌ను వెంటనే బయటకు తీసుకొచ్చారు. ఉరి వేసుకోవడానికి గల కారణాలను అడుగగా భార్య తనలో గొడవపడి తల్లిగారింటికి వెళ్లిపోయిందని, మనస్తాపానికి గురై ఉరి వేసుకోవడానికి పాల్పడ్డానని తెలిపాడు. ప్రాణాపాయ సమయంలో అక్కడికి చేరుకుని నిండు ప్రాణాన్ని కాపాడిన పోలీసులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఢిల్లీ పర్యటన బృందం ప్రొఫెసర్ రేవతి

బిలావర్‌పూర్ : సిర్గాపూర్‌లో ఐకేపీ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఢిల్లీ బృందం సభ్యులు

దిలావర్‌పూర్, జూన్ 27 : మహిళ సంఘుల ద్వారా తీసుకున్న రుణంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఢిల్లీ కేంద్ర బృందం ప్రొఫెసర్ రేవతి అన్నారు. గురువారం మహిళ సంఘుల జీవన స్థితిగతులు, వారి ఆర్థిక పరిస్థితులను తెలుసుకునేందుకు జిల్లా పర్యటనలో భాగంగా మండలంలోని గుండంపల్లీ, సిర్గాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని మహిళ సంఘం సభ్యులతో కలిసి సమావేశం నిర్వహించారు. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలతో మహిళలు చేస్తున్న చిరు వ్యాపారాల గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి దిలావర్‌పూర్ గ్రామంలోని మహిళ రైతు ఉత్పత్తిదారుల కంపనీని సందర్శించారు. ఈ సంవత్సరం మహిళ రైతుల ఉత్పత్తిదారులు చేసిన చిరు వ్యాపారం గురించి తెలుసుకున్నారు. ఈ సీజన్ తాము వివిధ రైతుల వద్ద నుంచి కందులు కోనుగోళ్లు చేసి మార్కెటింగ్ చేయడం వల్ల తమకు రూ.20 వేల లాభం చేకూరిందని అన్నారు. రాబోవు రోజుల్లో మరింత ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. ఇక్కడ ఢిల్లీ ప్రతినిధుల బృందం ప్రొఫెసర్‌లు గోవింద్ కెల్కర్, ఐకేపీ ఏపీఎం సులోచణరెడ్డి, సీసీలు ముత్యం, సిబ్బంది విశ్వనాథ్, మహేశ్ ఉన్నారు.

ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

కలెక్టర్ రాజర్షి షా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జూన్ 27 : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమాన్ని చేపట్టిందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన 2023-24 సంవత్సరానికి సంబంధించి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసి లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా సమగ్ర కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. 'మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి' అనే లక్ష్యంతో వచ్చే ఐదేళ్లలో మహిళలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళా శక్తి ద్వారా 15 రకాల కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అనంతరం కలెక్టర్ 2024-25 సంవత్సరానికి గాను జిల్లా నూతన సంవత్సర వార్షిక రుణ ప్రణాళిక పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొత్త ఎల్‌డీఎం ఉత్పల్ కుమార్, ఆర్‌బీఐ ఎల్‌డీవో దేబోజి బారువా, డీఆర్‌డీఏ సాయన్న, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజలింగు పాల్గొన్నారు.

గర్భిణీకి అవస్థలు

- రోడ్డు సౌకర్యం లేక ఎడ్లబండిలో తరలింపు
- గ్రామానికి అంబులెన్స్ రాని దుస్థితి

ఎడ్లబండి నుంచి ప్రైవేట్ వాహనంలో గర్భిణీని ఎక్కిస్తున్న కుటుంబ సభ్యులు

ఇచ్చోడ, జూన్ 27 : బాబ్జిపేట్ గ్రామానికి చెందిన గిరిజన మహిళ వనితకు గురువారం పురిటి నొప్పులు వచ్చాయి. రోడ్డు బాగా లేకపోవడంతో భర్త గంగాధర్, కుటుంబ సభ్యులు ఎడ్లబండిపైన ఆరు కిలో మీటర్ల దూరంలో ఉన్న సిరిచెల్మ గ్రామానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ప్రైవేట్ వాహనంలో ఇచ్చోడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి జిల్లాకేంద్రంలోని రిమ్స్‌కు అంబులెన్స్‌లో చేర్చారు. అత్యవసర పరిస్థితిలో రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి రోడ్డు వేయాలని కోరుతున్నారు.